# రోడ్డుప్రక్కన రోదన

శ్రీ కొండూరి కృష్ణమూర్తి

ప్రెసిడెన్సీ కాలేజి అప్పుడే వదిలారు. విద్యార్థులంతా ఒక్కొక్కరే ఇంటి ముఖం పడుతున్నారు. నేను సైకిలు స్టాండు నుంచి నా పాతర్యాలీ సైకిలు తీసుకుని శాంతోమ్ లోని మా ఇంటికి బీచి వెంటవస్తున్నా. మెరీనా వెంబడి వున్న ఒక్కొక్క భవనాన్నీ దాటుతూ కృష్టాంపేట శ్మశానాన్ని సమీపించా. అచ్చట ఎవ్వరూలేరు. ఒక్క ముదుసలి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. రోజూ నాకు యిలాంటి దృశ్యాలు చిరపరిచితమే. అయినా ఈ రోజు ఏదో వింతగా తోచింది. సైకిలు ముందుకు పోనంటోంది. సముద్ర ఘోషకంటె ఆమె ఘోష ఎక్కువగా వినిపిస్తోంది. అంతే. ముందుకు సాగలేక సైకిలు వెనక్కుత్రిప్పి ఆమెను సమీపించా.

ఆమెకు 60 సంవత్సరాలకు పైగావుంటుంది వయస్సు. నల్లగా దుమ్ముకొట్టుకుని వుంది ఆమె కట్టుకున్న చిరుగుల చీరె, ఆమె వంట్లోని ఎముకలు ఎక్సురేఫొటోలాగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులనుంచి ఏడుస్తున్నాదో గాని గొంతుక బొంగురుపోయింది. ఒక చెయ్యి ఎదురుగానున్నా మట్టిదిబ్బమీద పెట్టి ఇంకొక చెయ్యి నెత్తిన పెట్టుకుని. ఏడుస్తోంది. ఆమె నన్ను గమనించినట్లులేదు-గమనించినా తిరిగి చూడనైనా చూడలా. ఆమెకు మరి కొంచెం దగ్గిరకువెళ్ళి ఎదురుగా నుంచున్నా-లాగు జేబులో చేతులుపెట్టి. అప్పటికి ఆమె నన్ను గమనించినట్లు తలఎత్తి ఒకసారి నన్ను పరికించి చూచి మరల తలదించుకుని ఏడవటం ప్రారంభించిది.

నాకు అసలు సంగతి ఎమిటో బోధపడలా. ఆమె ఏమీ మాట్లాడలా. నేనేధైర్యం చేసి "ఎందుకమ్మా అలా ఏడుస్తా? ఎవరు చనిపోయారూ?" అన్నా.

ఆమె నావంక మరొకసారి చూచి చినిగిన చీరె కొంగుతో కళ్లతుడుచుకుని బొంగురుగొంతుతో "ఏం చెప్పను బాబూ. నా ఖర్మకు నేను ఏడుస్తున్నా. ఆర్చేవారా? తీర్చేవారా? నీ దోవన నీవు పో నాయనా. నన్ను ప్రశాంతంగా ఏడువనీ" అంది.

ఆమె మాటలు నన్ను మరింత కలతపెట్టినయి. "అది గాదమ్మా. నీవు ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరయినా నీ ముఖ్యులు చనిపోయారా? నాచేతనయిన సహాయం చేస్తా. నీవు ఏడుస్తుంటే నా హృదయం తరుక్కుపోతోంది. ఎందువలననో తెలియదు." అన్నా.

"నాయనా. నీకు చిన్న వయస్సు. లేతగుండె. నీకు 'ప్రేమ' అంటే ఏమిటో తెలియని రోజులు. అందులో మాతృప్రేమ అంటే అసలే తెలియదు. ప్రేమించిన వ్యక్తి మనల్ని దుఃఖసాగరాన ముంచితేఎంత బాధపడతామో నీకు అర్థంగాదు-అనుభవం లేనందున, కానీ నా యందు సానుభూతితో అడుగుతున్నావు కాబట్టి చెబుతా. విను" అని తన దీనగాధను వివరించటం ప్రారంభించింది,

★ ★ ★

"మావూరు ఇచ్చటికి 20 మైళ్లువుంది. చిన్న పల్లెటూరు. మేము బీదవాళ్లం. చెప్పుకోతగినంత ఆస్తిపాస్తులు లేవు. బహుశా నన్ను చూస్తేనే నీకు బోధపడివుంటుంది. మేమెంతబీదవాళ్లమో, మాకు పూర్వం, కొద్దిపాటి భూస్థితి వుండేది. అంటే రెండు ఎకరాలు, సొంతగుడిసె గూడా వుంది. ఏదో వున్నంతలో గంజి కాచుకుని తాగేవాళ్లం. ప్రస్తుతం చనిపోయి ఈ మట్టిదిబ్బక్రింద దీర్ఘ నిద్రపోతున్నాడు నా కుమారుడు. వీడి చిన్నతనంలోనే మా ఇంటాయన మమ్మల్ని శాశ్వతంగా వదలి పరలోకగతుడైనాడు. అటుపయిన నా బావమరది మారెండెకరాలూ సేద్యంచేస్తూ మమ్మలను కనిపెట్టుకుని వుండేవాడు. నా కుమారుడు పెరిగి పెద్దవాడై సొంతంగా వ్యవహరించగల సమర్థుడయేదాకా అతడే వ్యవసాయం చేసాడు. వీడు 18 ఏటనుంచీ సొంతంగా వ్యవసాయం చేయటంప్రారంభించాడు. ఎట్టి ఒడుదుడుకులు లేకుండానే కొంతకాలం

గడిచింది. క్రమంగా వాడికి పెళ్లిచేసి హాయిగా కోడలు మనుమలతో జీవితశేషం వెళ్లబుచ్చాలని తలచా. కానీ విధివేరుగా వుంది.

వరుసగా మూడు సంవత్సరాలు వానలు కురవలా. వ్యవసాయం స్తంభించి పోయింది. మా గ్రామానికి కాలువలుగానీ చెరువులుగానీ లేవు. కేవలం వర్షంమీదనే మా వ్యవసాయం ఆధారపడింది. నేలంతా బీటలు పారింది. వానరాకకోసం మేమంతా ముత్యపు చిప్పలు లాగా ఎదురుచూచాం. కానీ వానవచ్చే సూచనలు కనిపించలా. మనుష్యులూ పశువులూ గూడా తిండిలేక మల మల మాడిపోయారు. కూలిచేసుకునే దానికి గూడా పని దొరకటంలా. మాకు పొట్టగడువటమే కష్టమయిపోయింది మొదటపొలం తాకట్టుపెట్టాం. క్రమంగా ఎద్దులను గూడా అమ్మేశాం. కానీ పరిస్థితులు అనుకూలించ పోగాయింకా విషమించినయి. ఇల్లుగూడా తాకట్టుపెట్టాం. వడ్డీలు విప రీతంగా పెరిగినయి. క్రమంగా అప్పులవాళ్ళు ఇల్లు, పొలం కాజేశారు. మేమునడి రోడ్డులో నిల్చునే పరిస్థితి ఏర్పడింది. నా ఆశలు అడియాసలయినాయి.

"ఒక రోజున నా కొడుకు పట్టణంపోయి ఏదన్నా కూలిపని చేస్తానని చెప్పాడు. నాకు చాలా కష్టంవేసింది. అంతవరకూ మేమిద్దరం ఒకళ్లను విడిచి ఒకళ్ళు వుండలా. విధిలేక వెళ్లమన్నా. నా వద్దశెలవు పుచ్చుకుని వాడు యిక్కడికి వచ్చాడు. మా వూరినుంచి ఇంకా మరి కొందరు గూడా పట్నంవెళ్లారు. వాడు యిచ్చటికి వచ్చిన కొన్ని నెలలవరకూ వాడి యోగక్షేమాలు ఏమ్మీనాకు తెలియలా. కానీ నెలనెలా డబ్బు మనిఆర్డరు చేసేవాడు నా భోజనానికి. నాకు మాత్రం చాలా భయంగా వుండేది. ఎక్కడ తిని ఎక్కడ పడుకుంటున్నాడోయని. ఒక రోజున వాడిని తలచుకుని విచారిస్తున్నా. అంతలో ప్రక్క యింటివాళ్ల కుమారుడు మా వాడితో పట్నం వెళ్ళి సెలవు మీద ఇంటికివచ్చి నా వద్దకువచ్చాడు. వాడిని ఆత్రంతో మావాడి యోగక్షేమాలు విచారించా. మావాడు కులాసాగానే వున్నాడని తెలిపాడు. మావాడు మరికొందరితో చేరి లాగుడు బండ్లమీద సరుకులను హార్బరునుంచి గోదాముల లోనికి చేర్చే ఉద్యోగమట. ఒకొక్క బండికి నలుగురు వుండేవారుట. ముందు యిద్దరూ వెనకాల యిద్దరుండి బండిని లాక్కుని పోయేవారుట యిది వినేసరికి నాకు పైప్రాణం పైనేపోయింది. చివరకు పశువులులాగా బండిని లాగాల్సి వచ్చిందే. అని పరిపరి విధాల వాపోయా.

"అలానే మరికొంత కాలంగడిచింది. నేను పట్నంవెళ్లి వాడికి వండి. పెడుతూ అచ్చటనే వుండాలని తహతహ లాడా. వాడికి ఈ విషయం రాయాలనుకున్నా. కానీవాడి అడ్రసు తెలియలా.

"రోజులు గడచినకొద్దీ మావాడిని చూడాలనెడి కాంక్ష నాలో దినదిన ప్రవర్ధమాన మవుతోంది. ఇంతలో మా ప్రక్కయింటి వాళ్ళ అబ్బాయి పట్నంనుంచి తిరిగివచ్చి మావాడు బర్మా వెళ్ళాడని చెప్పాడు. మరికొందరితోకలిసి హెచ్చు జీతానికి బర్మాలో రబ్బరుతోటలలో పనిచేయ టానికి వెళ్ళాడుట. అక్కడ డబ్బుబాగా సంపాదించితిరిగి వచ్చి ఎడ్లు బండ్లు, పొలంకొని సుఖంగావూరిలో జీవితం వెళ్ళబుచ్చుతానని మావాడు అన్నాడుట. తరువాత కొన్ని రోజులకు నాకు నెలకు 50 రూపాయలు చొప్పున రంగూనునుంచి డబ్బు వచ్చేది. ఆ డబ్బు చూచుకుని ఏడవాలో నవ్వాలో నాకుబోధపడలా. కాని వాడుక్షేమంగా తిరిగి వచ్చి పెళ్ళి చేసుకుని సుఖపడతాడని ఆశించా.

"ఆ ఆశతోనే రోజులు గడిపా. ఒక సంవత్సరం పైగా అలానేగడిపా. మధ్య మధ్య నా కొడుకుని తలుచు కున్నప్పుడల్లా వాడిని చూస్తానో లేదో అనే అనుమానం కలిగేది. కానీ తప్పకుండా తిరిగివస్తాడనే ఆశనాలో బలీ యంగా వున్నందున కొంచెం ధైర్యంగా వుండేదానిని. ఒకరోజున ఎందుకనో నా హృదయం వాడిని చూడాలని తహతహ లాడింది. అంతకు ముందురాత్రే వాడు కలలో కనిపించాడు. అప్పటినుంచి నాకు పిచ్చిఎక్కినట్లయింది అన్నం నీళ్ళు సహించలా. వాకిట్లో కూర్చుని విచారంగా దోవనుపోయే జనాన్నిచూస్తూకూర్చున్నా. ఇంతలో పోస్టు జవాను వచ్చి మనియార్డరు యిచ్చాడు. మా వూరిలో పోస్టాపీసు లేదు. ప్రక్క గ్రామంనుంచి వారానికి రెండు సార్లు వచ్చి వుత్తరాలు యిచ్చి పోతుంటాడు. ఆ పోస్టు బంట్రోతు మనియార్డరు మీద వేలుముద్ర వేశిన తరువాత డబ్బుతోపాటు క్రిందనున్న ఒక చిన్న చీటిని చించి యిచ్చాడు. అందులో ఏముందో నాకు తెలియక అతడినే చదివి చెప్పమని అడిగా. అతడు చదివి నాకొడుకుకు చాలా జబ్బుచేసి బర్మానుంచి పట్నానికి తిరిగి వచ్చాడనీ ప్రస్తుతం హాస్పిటల్‌లో వున్నాడని నన్ను వెంటనే రమ్మని అడ్రసు రాశాడనీ చెప్పాడు.

"నా పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. అంతకు ముందు రెండురోజుల నుంచీ అన్నమూ నీళ్ళు ముట్టలా నేను. ఈ వార్త వినేసరికి నాకు చెప్పలేనంత దుఃఖం

వచ్చి బిగ్గరగా ఏడ్చా. పక్కయిళ్ళంతా పోగయి సంగతి తెలుసుకుని నన్ను ఓదార్చారు. అంత కంటే పాపం వాళ్ళేమి చేయగలరు? నా చేతిలో డబ్బువుంది. వెంటనే మావూరి కరణంగారి వద్దకువెళ్ళా. ఆయన చాలా మంచి వాడు. ఆయన పట్నంలో హాస్పిటలు ఎక్కడ వున్నదో ఎలా వెళ్ళ వలసిందీ వివరంగా చెప్పి అడ్రసునిగూడా వివరంగా రాసి యిచ్చాడు. పట్నంవెళ్ళి ఎవరికయినా ఆ కాగితం చూపిస్తే హాస్పిటలుకు ఏలా వెళ్ళ వలసిందీ చెబుతారని చెప్పాడు. నేను ఆయనవద్ద సెలవు పుచ్చుకుని బస్సుఎక్కా. కండక్టరుతో హాస్పిటలుకు సాధ్యమయి నంత దగ్గిరలో నన్ను దించమని ముందుగానే ప్రాధేయ పడ్డా. అతడుగూడా అందుకు అంగీకరించాడు.

"తరువాత కొన్ని గంటలకు బస్సు పట్నం చేరింది. అతడు నన్ను హాస్పిటల్ వద్దనే దించాడు. అక్కడ నున్న వాచ్‌మన్‌కు నాలుగణాలు ముట్టచెప్పి లోపలికి వెళ్ళా. అక్కడ అన్నీ మంచాలే. అందరూ రోగులే. అందులో మావాడు ఎవరో కనుక్కోవటం చాలా కష్టం అయింది. అక్కడనున్న ఒక నర్సు సహాయంతో మా వాడిని తెలుసుకుని వాడి మంచం ప్రక్కకువెళ్ళి నుంచుని చూచా. వాడు గుర్తు పట్టటానికి వీలు లేనంతగా మారి పోయాడు. వాడిని చూచేసరికి నా కడుపు తరుగుకొని పోయింది. ఆవురుమని ఏడుస్తూ వాడిని కౌగలించుకున్నా మావాడి ప్రక్కనున్న యితర రోగులంతా విచిత్రంగా చూస్తున్నారు. మావాడికి కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి వాడినోటిలోనుంచి మాటలు పెగిలిరావటంలేదు. వాడిని చూచేసరికి యిక బ్రతకడని నిశ్చయించు కున్నా. అలానే ఏడుస్తూ ఆ ప్రక్కనే కూర్చున్నా.

"వాడు అప్పటికింకా మనధోరణిలోనే వున్నాడు. బర్మాలో వాడిజీవితంగురించి చెప్పాడు. బర్మా పోంగానే రబ్బరుతోటలో పెద్దజీతంమీద వుద్యోగం దొరికిందిట. మొదట్లోకొంచెం కష్టపడ్డాడుట. తరువాత మావాడిని రబ్బరుపాలు తీసేవాళ్ళమీద మేస్త్రీగా నియమించారుట. జీతంకూడా పెంచారుట. మంచిజీతం, మంచితిండి, మంచి గుడ్డలు. ఇంకేంకావాలి వాడికి. బోలెడంత డబ్బు నిలవచేశాడుట. ఒకరోజున సాయంత్రం రబ్బరుతోట నుంచి యింటికి వస్తుండగా కొంచెం చలివేసిందిట. యింటికి వచ్చేసరికి చలి విపరీతమయి జ్వరం వచ్చిందిట. ఆ దేశం అంతా మన్యప్రదేశం. అందువలన తరుచుగా అందరికీ చలిజ్వరం వస్తుందిట. తరువాత ఒక వారం రోజులు హాస్పిటల్‌లో గడిపాడుట. క్రమంగా జ్వరం తగ్గుముఖం పట్టింది. కానీ వళ్ళు చిక్కి శల్యమయి పోయిందిట. కనీసం లేచి బయటకి పోవటానికిగూడా శక్తి లేకుండా పోయిందిట. అప్పటినుంచీ చలిజ్వరం తరచుగా వచ్చేదిట. క్రమంగా అది వంట్లో జీర్ణించి పోయిందిట. అందువలన రబ్బరుతోటల అధికారులు మావాడిని వుద్యోగంనుంచి తీసివేసి కొంతడబ్బు యిచ్చి తిరిగి పట్నం పంపేశారు. యిచ్చటికివచ్చి వారంరోజులు అయిందిట. వాడు అప్పటికి అంత్య ఘడియలలో వున్నాడు. వాడికి అది తెలియదు. అసలు వాడివంట్లో బొమికలుతప్ప వేరేమీ మిగలలా. వాడికిమాత్రం జ్వరం తగ్గుతుందనే నమ్మకం వుంది. అందువలనే వూరి సంగతి పొలం ఎడ్లు వెల ఎలావున్నదీ. అడిగాడు. తరువాత రెండురోజులకు కన్నుమూశాడు. నేను మిగిలా. వాడిని నాచేత్తో తగలవేయటానికి "అంటూ బిగ్గరగా ఏడవటం ప్రారంభించింది.

ఆమెగాధ వినేసరికి నాగుండెలు తరుక్కుపోయి నయి. ఆమె అన్నట్లుగానే నాకు చావుబ్రతుకులు, కష్ట సుఖాలసంగతీ ఏమీ తెలియకపోయినా నాకంటినుంచి రెండు కన్నీటిబొట్లు అప్రయత్నంగా క్రింద రాలినయి. గబగబా లేచి జేబులు తడుముకున్నా. అంతాచేరి అయిదు రూపాయలలోపు దొరికినయి. ఆ డబ్బును బలవంతాన ఆమె గుప్పిటిలో పెట్టి సైకెలు ఎక్కి వెనక్కు తిరిగి చూడకుండా యింటికిపోయా. కాఫీ తీసుకొచ్చి యిచ్చింది అమ్మ. కానీ రుచించలా. గదిలోకివెళ్ళి ఒక పుస్తకం తీసుకుని చదవటం ప్రారంభించా. ఏమీ బుర్రకు ఎక్కటంలా. నామనస్సంతా ఆమెమీదే లగ్న మయింది. ఆమె అన్న మాటలే జ్ఞాపకంవచ్చాయి. పుస్తకంలో గూడా "నీకు కష్టసుఖాలు తెలియవు నాయనా. నీది లేతవయస్సు." అన్నమాటలే కనిపించి నయి. ఆమాటలే నాహృదయంలో శాశ్వతంగా చెక్క బడినయి. నాజీవితంలో మరవరాని దృశ్యం అస్మశాన సంఘటన.

